క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ




మినహాజ్ చార్వీశ్రీ

ఓర్వకల్లు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన పరీక్షలలో మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. హుసేనాపురం గ్రామానికి చెందిన పటాన్ ఖాదర్‌వలి కుమారుడు మినహాజ్ 49/50 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు మండల విద్యాశాఖాధికారిణి సునంద తెలిపారు. అదేవిధంగా లొద్దిపల్లె గ్రామానికి చెందిన గజ్జల వెంకటస్వామి కుమార్తె చార్వీశ్రీ 44 మార్కులు సాధించి జిల్లాలో 36వ ర్యాంక్ దక్కించుకున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సదరు విద్యార్థులను ఆయా ఉపాధ్యాయులతో పాటు, ఎంఈఓ సునంద అభినందనలు తెలియజేశారు.

నేడు మున్సిపల్ వేలాలు

గూడూరు: నగర పంచాయతీ పరిధిలో మిగిలిపోయిన వ్యాపారాలకు సంబంధించి శనివారం వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద పశువుల మాంసం మార్కెట్, పెద్ద కమేళాకు బహిరంగ వేలం నగర పంచాయతీ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



పాణ్యం: మండల పరిధిలోని జీఎం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన మధన్, మణికంఠతో పాటు మరో నలుగురు ఏపీ 39 ఎల్‌జెడ్ 7168 నంబర్ గల కారులో తిరుమల వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకుని స్వగ్రామానికి తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో అతి వేగంగా వస్తూ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా వారిని శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ

కోడుమూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగించేందుకు ప్రజలంతాకలిసి రావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కోడుమూరులోని ఇంద్రజిత్‌గుప్తా కాలనీలో ప్రజా సంఘాల నాయకులు, కాలనీవాసులతో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ..కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇష్టానుసారంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరిచిందన్నారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 29న సాయంత్రం కోడుమూరులో జరిగే ప్రచారభేరి బహిరంగసభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సులోచనమ్మ, మండలకార్యదర్శి రాజు, రాముడు, మధు, ఓబులేసు, వెంకట్రాముడు తదితరులున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఉప్పలపాడు గ్రామం వద్ద ఓ కల్లంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పేకాటఆడుతున్న వ్యక్తులను అరెస్ట్‌చేసి రూ.11 వేలనగదు, 3 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగశేషుడు(49) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం, ఇటీవల పక్షవాతానికి గురయ్యాడని, కోలుకున్నాక పనులు చేయించేవారన్నారు. అయితే ఉన్నటుండి ఆరోగ్య సమస్య తీవ్రమై మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య సుంకులమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏపీడీ బాలాజీనాయక్, ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఓ విజయరాణి, సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ రమణయ్యలు మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వందేళ్ల వైద్యాలయం

సెయింట్ థెరిసా జనరల్ (గోషా) హాస్పిటల్



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న సెయింట్ థెరిసా జనరల్ హాస్పిటల్ (గోషా)కు వందేళ్లు నిండాయి. రెవ.మాథియాస్ వోల్ఫ్ నెదర్లాండ్స్‌లో చర్చిని ఏర్పాటు చేసేందుకు 1822లో సొసైటీ ఆఫ్ మేరీ జీసస్ మేరీ జోసఫ్ (జేఎంజే)ని స్థాపించారు. తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయన గుంటూరుకు సిస్టర్స్ (నన్స్) బృందాన్ని పంపించారు. 1904 ఫిబ్రవరి 28న వారు గుంటూరు వచ్చి సేవలు ప్రారంభించారు. ఆ తర్వాత అప్పటి మున్సిపల్ అధికారుల విన్నపం మేరకు రోమ్‌లో థెరిసా ఆఫ్ చైల్డ్ జీసస్‌ను సుందరీకరించిన రోజున కర్నూలులో 29-04-1923 సెయింట్ థెరిసా జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ ఆసుపత్రి కర్నూలులోని పాతబస్తీ వాసులకు ప్రసూతి సేవలతో పాటు చిన్నపిల్లలకు వైద్య సేవలు అందిస్తోంది. ఎంతో మంది గొప్ప పదవుల్లో ఉన్న వారు, ప్రముఖులు ఈ ఆస్పత్రిలో జన్మించి ఉండడం విశేషం. ఇప్పటికీ నామమాత్రపు రుసుముతో మాతాశిశు సేవలతో పాటు జనరల్ సర్జరీ, జనరల్ ఫిజీషియన్ సేవలను సైతం అందిస్తున్నారు. అంతేగాక ఫిజియోథెరపీ, నర్సింగ్, హెచ్‌ఐవీ రోగులకు కౌన్సిలింగ్, వైద్యశిబిరాల ఏర్పాటు వంటి సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులకు చికిత్సను అందించేందుకు గాను ప్రత్యేకంగా నందికొట్కూరు రోడ్డులో కేర్ అండ్ సపోర్ట్ సెంటర్(శాంతినికేతన్)ను సీనియర్ మార్టిన్ మాలికల్, సీనియర్ అగస్టీన్ పీటర్స్ నిర్వహిస్తున్నారు. గోషా హాస్పిటల్ పాత భవనాన్ని ఆధునీకరించేందుకు 2001 నుంచి 2005 వరకు పనులు జరిగాయి. 2011లో అవసరమైన పరికరాలతో ఐసీయూను ప్రారంభించినట్లు హాస్పిటల్ ఎంఐఆర్‌డీ డాక్టర్ మన్సూర్ రహమాన్ తెలిపారు.

గోషా ఆసుపత్రి పేరు ఎలా వచ్చిందంటే..

నగరంలోని గోషా ఆసుపత్రికి ఎంతో పేరుప్రఖ్యాతలు ఉన్నాయి. సెయింట్ థెరిస్సా జనరల్ ఆసుపత్రి అనే బోర్డు ఉన్నా.. గోషాసుపత్రిగానే ప్రాచుర్యంలో ఉంది. ఆసుపత్రి ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్నా పిలుపులో వినిపించే పేరు వెనుక అసలు కథ తెలిసిన వారు చాలా అరుదు. వాస్తవానికి ఆసుపత్రి చుట్టుపక్క ప్రాంతంలో ఒకప్పుడు ముస్లింలు అధికంగా నివాసం ఉండేవారు. వీరందరికీ ప్రసూతి, ఇతర వైద్య సేవలకు ఈ ఆసుపత్రి పెద్ద దిక్కుగా నిలిచింది. అయితే ముస్లింలు ధరించే బురఖాలు, ఆసుపత్రిలో చికిత్స అందించే మహిళా క్రైస్తవ వైద్యులు కూడా బురఖాలను పోలిన దుస్తులనే ధరించేవారు. వీటిని ముస్లింలు గోషాలు(పరదా)గా పిలుస్తుండటం, వీటిని ధరించిన వైద్యులు సేవలందిస్తున్న ఆసుపత్రి కావడంతో గోషాల ఆసుపత్రిగా, ఆ తర్వాత కాలంలో గోషా ఆసుపత్రిగా పేరు స్థిరపడింది.

సర్వే పక్కాగా చేపట్టండి

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 28, 29 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన సిటిజన్ అవుట్ రీచ్ సర్వే కార్యక్రమాన్ని సిబ్బంది, వలంటీర్లు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధి పొందుతున్న విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శనివారం లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ తిరిగి సిటిజన్ అవుట్ రీచ్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ మాధవీలత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కె.నాగలాపురంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులు చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ప్రజలందరు సచివాలయాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాల మరమ్మతులు చేపట్టండి



అధికారులకు సూచనలు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ విజయ

కర్నూలు(న్యూటౌన్): మనబడి నాడు-నేడు నిధులు రూ.16 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని కర్నూలు మండల స్పెషల్ ఆఫీసర్ విజయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం వెంకాయపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల భవనం పాతబడిందని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి రంగులు వేయాలని సూచించారు. వేసవిలోగా నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేయాలని స్కూల్ కమిటీ చైర్మన్ జరీనాను ఆదేశించారు. కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు, తహసీల్దార్ ఆర్.శివరాముడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ ఈఈ కర్రెన్న, తదితరులు ఉన్నారు.


ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



సి.బెళగల్‌లో ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ అల్లిపీరా సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల ఉపాధి హామీ అధికారులతో కలిసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో రోజువారీ కూలీల సంఖ్య 6 వేలు ఉండగా 4 వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు మండలానికి ఇచ్చిన లక్ష్యాలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. కూలీల వివరాలు, పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయడంలో మేటీలు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకపై పనుల పట్ల మేటీలు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సీనియర్ మేట్లు, ఎఫ్ఏలు, టీఏలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీడీఓ హెచ్చరించారు. గ్రామాలలో ఉపాధి పనుల కల్పన, నిర్వహణ, పర్యవేక్షణపై పలు సూచనలు చేశారు. ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, వితేంద్రరెడ్డి, టీఏలు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు




వెంకాయపల్లెలో శిథిలమై ప్రమాదకరంగా మారిన నీటిట్యాంకు, దెబ్బతిన్న పిల్లర్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో 1992లో నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలమై ప్రమాదకరంగా మారింది. ట్యాంకు పిల్లర్లు పెచ్చులూడి మంచినీటి ట్యాంకుకు కొంతదూరంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. అటువైపుగా ఆడుకునేందుకు బడిపిల్లలు వస్తూ వెళ్తుంటారు. ఆదమరిస్తే అంతే సంగతులని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవస్థానం పూజారులు ఎల్లరాజు, చిన్నయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంకును తొలగించి అదే స్థానంలో కొత్తగా మంచినీటి ట్యాంకును నిర్మించాలని వెంకాయపల్లె గ్రామ ప్రజలు కోరుతున్నారు.

‘ఉపాధి’లో పురుషుల హాజరు శాతం తక్కువ



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేపట్టే పనులకు పురుషుల హాజరు శాతం తక్కువగా ఉందని డ్వామా పీడీ అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గోకులం సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి అధ్వర్యంలో జరిగింది. లైన్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు. డ్వామా పీడీ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద మహిళల జీవనోపాధుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య వివరించారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా పొదుపు మహిళలకు లింకేజీ రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, ఉద్యాన అధికారి మహబూబ్‌బాషా, డీఆర్‌డీఏ-వైకేపీ డీపీఎం రెహ్మాన్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(టౌన్): భారత గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వచ్ఛ తులిప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్ శిక్షణకు ఔత్సాహికులు వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పట్టభద్రులు, డిప్లొమా, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛ భారత్, సిటిజన్ అవుట్ రీచ్ సర్వే, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి పారితోషకం ఉంటుందని, వివరాలకు https://internship.aicteindia.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 97016 42001 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూపులు



గూడూరు నుంచి మారందొడ్డికి వెళ్లే రోడ్డు

గూడూరు రూరల్: గూడూరు నుంచి ఎర్రగుంట్ల కొట్టాల మీదుగా మారందొడ్డికి రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎర్రగుంట్ల కొట్టాలకు రోడ్డు, బస్సు సౌకర్యం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యం, కూరగాయలను వాహనాల్లో తరలించేందుకు అవస్థలు పడుతున్నారు. గూడూరు నుంచి బ్రాహ్మణదొడ్డి మీదుగా మారందొడ్డికి రోడ్డు, బస్సు సౌకర్యం ఉంది. అయితే గూడూరు నుంచి ఎర్రగుంట్ల కొట్టాల మీదుగా మారందొడ్డికి రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు అదనంగా 8 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో గూడూరు నుంచి ఎర్రగుంట్ల కొట్టాల మీదుగా బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి వరకు రోడ్డు వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే చేసి అనంతరం వదిలివేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రజలు రోడ్డు నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గూడూరు నుంచి మారందొడ్డి వరకు బీటీ రోడ్డు వేస్తే ప్రయాణ దూరంతో పాటు సమయం ఆదా అవుతుంది. ఎర్రగుంట్ల కొట్టాలలో గజ్జలమ్మ గుడి ఉండడం కారణంగా చుట్టు పక్కల గ్రామాల వారు ఎక్కువగా దేవర కార్యక్రమం నిర్వహిస్తుంటారు. రోడ్డు, బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గూడూరు నుంచి మారందొడ్డి వరకు బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు



వీకర్ సెక్షన్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయని ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 27, 41వ వార్డుల్లోని వెంకటాద్రినగర్, వీకర్ సెక్షన్ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులకు స్థానిక కార్పొరేటర్ శ్వేతారెడ్డి, వార్డు నాయకులు గంగులు, మాబుసా, ప్రతాప్‌రెడ్డి, మాధవస్వామి, ఖాదర్, సాగర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంపొందేలా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ప్రజలకు ఏం చేసిందని, ఇప్పుడు వారు వచ్చి చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 37వ వార్డులో దాదాపు రూ.కోటి నిధులతో డ్రైనేజీల సమస్య పరిష్కరించామన్నారు. వీకర్ సెక్షన్ కాలనీలో ప్రాధాన్యతలను అనుసరించి డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు నిర్మిస్తామన్నారు. ఆయా కాలనీలవాసులు సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ రేణుక, అవుకు జెడ్పీటీసీ చల్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్లు, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పుల్లారెడ్డి, సాయి, సిద్దు, సుధాకర్, గోపి, వెంకటరెడ్డి, వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంతో పాటు బిలకలగూడూరు, బూజునూరు గ్రామాల రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంఘంపై అవగాహన కల్పించినట్లు నవయూత్ అసోసియేషన్ సీఈఓ రవీంద్రాచారి తెలిపారు. ఆయా గ్రామాల్లో నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేయనున్న సంఘాల వల్ల ఉపయోగాలను రైతులకు వివరించారు. సీఈఓ మాట్లాడుతూ..రైతులు, గొర్రెలు, మేకలు పెంపకదారులు ఈ సంఘంలో చేరవచ్చన్నారు. రైతులు పండించిన దిగుబడులను వ్యాపారులకు అమ్ముకోవచ్చన్నారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా కల్లూరు ప్రాంతంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు విద్యుత్ శాఖ కల్లూరు ఎస్టేట్ ఏఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరుతో పాటు పోలీసు కాలనీ, భగవాన్ నగర్, ముజఫర్ నగర్ కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

రిటైర్డ్ డీఎస్పీ కన్నుమూత



శివశంకర్‌రెడ్డి (ఫైల్)

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన రిటైర్ అయిన డీఎస్పీ శివశంకర్ రెడ్డి (73) అనారోగ్యంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందారు. కడప జిల్లా పులివెందుల తాలూకా సుంకేసుల గ్రామానికి చెందిన శివశంకర్ రెడ్డి 1978లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ 2009లో ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీ హోదాలో పదవీ విరమణ పొందారు. అనంతరం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉంటున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లాలో ఆయనతో పాటు పనిచేసిన పలువురు అధికారులు నివాళులర్పించేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించండి



సి.బెళగల్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న పీఆర్ ఏఈ గంగరాజు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిరంతర పర్యవేక్షణ చేయాలని మండల పీఆర్ ఏఈ గంగరాజు సూచించారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 16 గ్రామ సచివాయాల నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఇప్పటి వరకు కేవలం మూడు సచివాలయాలు మాత్రమే ప్రారంభమయ్యాయని, మరో మూడు భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగతా భవన నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలు, ఆర్‌బీకే భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నాణ్యతగా వేగవంతం అయ్యేలా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



బురాన్‌దొడ్డిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈఓఆర్డీ సందీప్


సి.బెళగల్: పల్లెల శుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కూలీలు శ్రద్ధ వహించాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. ఆయన శుక్రవారం సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాలలో పర్యటించి పరిసరాల శుభ్రత, మంచినీటి నిర్వహణను పరిశీలించి, ఆయా గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. సి.బెళగల్ ఎస్సీ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను స్వయంగా పైకి ఎక్కి పరిశీలించారు. మంచినీటి నిర్వహణ, సరఫరా తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామ ప్రధాన దారివెంట ఉన్న చెత్తను తొలగించి, చెత్త సేకరణ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని పీఎస్ వెంకటేష్‌ను ఆదేశించారు. గ్రామాల పరిశుభ్రతపై అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కూలీలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీఓఏ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో ఏపీ వైఎస్సార్ క్రాంతి పథంలో వీఓఏగా పనిచేస్తున్న లక్ష్మిదేవి అనారోగ్యంతో మృతిచెందింది. ఏపీ వైఎస్సార్ క్రాంతి పథం వీఓఏల ఉద్యోగుల సంఘం తరపున లక్ష్మీదేవి కుటుంబానికి రూ.1,15,000 ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జిల్లా కార్యదర్శి రంగన్న, కోశాధికారి పద్మావతి, గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు వరలక్ష్మి, రవికుమార్, ఉప కార్యదర్శి భాస్కర్ నాయుడు, మండల గౌరవాధ్యక్షులు బాలస్వామి, తదితరులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు.



కొండలరాయుడి కొండపై ఏర్పడిన గుహ

అబ్బురపరిచే గుహ

కోడుమూరు: స్థానిక కొండలరాయుడి కొండపై ఏర్పడిన అరుదైన గుహ ప్రజలను అబ్బురపరుస్తోంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ గుహ కోడుమూరు వాసులకు తెలిసిన విషయమే. ఏటా నాగుల చవితి సందర్భంగా కొండలరాయుడికి పూజలు చేసే సమయంలో పట్టణ ప్రజలు ఈ గుహను కూడా సందర్శిస్తుంటారు. ఈ గుహకు సంబంధించిన వాస్తవ విషయాలపై పెద్దలు కథలు, కథలుగా చెప్పుకుంటారు. పూర్వం రాజుల పరిపాలనా కాలంలో ప్రత్యర్థుల నుంచి తప్పించుకునేందుకు ఈ గుహ ఏర్పాటు చేసినట్లు ప్రచారంలో ఉంది. కోడుమూరు కొండరాయుడు కొండ నుంచి చనుగొండ్ల సమీపంలో ఉన్న కొండ వరకు ఈ గుహ ఉన్నట్లు చెబుతున్నారు. 20 ఏళ్ల క్రితం గుహలో దాదాపు 1 నుంచి 2 కి.మీ వరకు జనం వెళ్లి వచ్చే వారని పెద్దలు చెబుతారు. ఈ గుహ అంతగా ప్రచారంలోకి రాకపోగా, ఇక్కడ సందర్శనార్థం వచ్చి పోయే జనం అడపా, దడపా రాళ్లు వేయడమే గాక వర్షాకాలంలో మట్టి కొట్టుకుపోయి గుహ ముందు భాగం పూడిపోయే దశకు చేరుకుంది.